### బోనాల పండుగకు ఆహ్వానం

దుండిగల్,జూలై 25 : నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఈ నెల 28న జరిగే బోనాల ఉత్సవాల్లో పాల్గొనాలంటూ ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌ను గురువారం డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్ ఆహ్వానించారు. నిజాంపేట్‌లోని నల్లపోచమ్మ యూత్ సభ్యులతో కలిసి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేలకు ఆహ్వానపత్రాలు అందజేశారు. సోమవారం రాజీవ్‌గృహకల్ప సముదాయంలో జరిగే తొట్టెల ఊరేగింపులోనూ పాల్గొనాలని కోరారు.

**బోనాల పండుగను ఘనంగా జరుపుకుందాం.. : మేయర్**

నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలో బోనాల పండుగను ఘనంగా జరుపుకుందామని మేయర్ కొలన్‌నీలాగోపాల్‌రెడ్డి దంపతులు అన్నారు. గురువారం రాజీవ్‌గృహకల్ప,సాయినగర్ వాసులు మేయర్ దంపతులను వారి నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి ఆదివారం జరిగే బోనాలకు రావాలని ఆహ్వానపత్రాలు అందజేశారు. అంతకుముందు ఆలయాల వద్ద చేపట్టిన ఏర్పాట్లపై మేయర్ ఆలయ కమిటీ ప్రతినిధులతో చర్చించారు.

### 'డ్రైనేజీ సమస్యను పరిష్కరించండి'

దుండిగల్,జూలై 25 : సూరారం కాలనీ రాంలీలా మైదానం వద్ద డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని బీజేపీ అర్బన్ జిల్లా ఇన్‌చార్జి కన్వీనర్ డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. రాంలీలా మైదానం వద్ద డ్రైనేజీ పొంగి మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో స్థానికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. గురువారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ మాజీ సభ్యులు ఎంఎస్ వాసు, జేకే శేఖర్‌యాదవ్ తదితరులతో కలిసి డ్రైనేజీని పరిశీలించారు. డ్రైనేజీ సమస్యను అధికారులు వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్పొరేటర్ రావుల శేషగిరి, జీ. సత్యనారాయణ రాజు, నాయకులు శివాజీరాజు, శ్రీరాములు, భీమరాజు,గణేశ్ పాల్గొన్నారు.

# వైభవంగా బోనాల ఉత్సవాలు

- పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఎమ్మెల్యే కృష్ణారావు, కార్పొరేటర్లు

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 25 : కూకట్‌పల్లి పరిసర ప్రాంతాల్లో ఆషాఢమాస బోనాల ఉత్సవాలు వైభవంగా ప్రారంభమయ్యాయి. గురువారం కూకట్‌పల్లి పోచమ్మ ఆలయంలో జరిగిన బోనాల ఉత్సవాల్లో ఎమ్మెల్సీ కుర్మయ్యగారి నవీన్‌కుమార్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ జూపల్లి సత్యనారాయణ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. మన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకుని భవిష్యత్ తరాలకు అందించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రజలు సుఖసంతోషాలతో జీవించాలని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

* కూకట్‌పల్లి, మూసాపేట డివిజన్లలో జరిగిన బోనాల పండుగలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్‌రావు కుటుంబ సభ్యులతో కలసి పూజలు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్ అమ్మవారి ఆలయాల్లో పూజలు చేశారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు పట్లోళ్ల నాగిరెడ్డి, చున్ను పాషా, వేణు తదితరులు ఉన్నారు.

**మూసాపేట డివిజన్‌లో..**

మూసాపేట : డివిజన్ పరిధిలోని భవానీనగర్, లచ్చయ్యనగర్, అంబేద్కర్‌నగర్, బాబు జగ్జీవన్‌రామ్‌నగర్, మారుతినగర్, మూసాపేట విలేజ్, జనతానగర్ తదితర ప్రాంతాల్లో గురువారం బోనాల పండుగ నిర్వహించారు. శ్రీరేణుకా ఎల్లమ్మ, నల్లపోచమ్మ అమ్మవార్లకు ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాజీ కార్పొరేటర్లు తూము శ్రావణ్‌కుమార్, బాబురావు ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత బోనాల ఉత్సవాలను మరింత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం రేణుకా ఎల్లమ్మ ఆలయ చైర్మన్ సప్పిడి శ్రీనివాసరావు అతిథులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్, ప్రభాకర్‌గౌడ్, చంద్రశేఖర్, తుకారాం, విష్ణు, రాజు, మల్లేశ్, మనోజ్, అడివయ్య, కృష్ణ, జైరాజ్, అర్జున్, నరేశ్, రవి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి పోచమ్మ ఆలయంలో అమ్మవారికి పూజలు చేసిన ఎమ్మెల్సీ నవీన్‌కుమార్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ సత్యనారాయణ తదితరులు

మూసాపేటలో బోనాల వేడుకల్లో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి బండి రమేశ్, నాయకులు నాగిరెడ్డి, తదితరులు

మూసాపేటలోని రేణుకా ఎల్లమ్మ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, తదితరులు

## సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

- శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ అనంతరం లబ్ధిదారులతో శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

మియాపూర్ , జూలై 25 : నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివిధ డివిజన్‌లకు చెందిన 28 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం కింద మంజూరైన రూ. 28,03,248 విలువైన చెక్కులను ఎమ్మెల్యే గాంధీ గురువారం తన నివాసంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదింటి ఆడపడుచులకు సీఎం రేవంత్‌రెడ్డి పెద్దన్నలా అండగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసరెడ్డి ఉన్నారు.

- ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని చంద్రమ్మ కాలనీకి చెందిన తన్నీరు మధుకు సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ పత్రాన్ని ఎమ్మెల్యే గాంధీ తన నివాసంలో అందజేశారు. పేదలెవరూ అనారోగ్యంతో వైద్యానికి దూరం కావొద్దన్న లక్ష్యంతో సీఎం సహాయ నిధి వారికి భరోసా ఇస్తున్నదని ఎమ్మెల్యే పేర్కొన్నారు. శ్రీను, రాజేశ్, కృష్ణారావు, కొండారెడ్డి పాల్గొన్నారు.

## స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో పెయింటింగ్స్ ప్రదర్శన

చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో చిత్రాలను తిలకిస్తున్న మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి

కొండాపూర్, జూలై 25 : విభిన్న రకాల పెయింటింగ్స్, శిల్పాలు, డిజిటల్ వర్క్స్‌తో రూపొందించిన అందమైన చిత్రాలకు మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీ వేదికగా నిలిచింది. గురువారం నేషనల్ గ్రూపు ఆర్ట్ షో ఆధ్వర్యంలో 'యునిసన్' పేరిట ఏర్పాటు చేసిన పెయింటింగ్స్ ఎగ్జిబిషన్‌ను మాజీ స్పీకర్, ఎమ్మెల్సీ మధుసూదనాచారి ప్రారంభించారు. అనంతరం ప్రదర్శనలో ఉంచిన చిత్రాలను తిలకించి వివరాలు తెలుసుకున్నారు. 30 మంది ఆర్టిస్టులు వేసిన 55 చిత్రాల ప్రదర్శన జులై 27 వరకు కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఆర్ట్ సొసైటీ అధ్యక్షుడు ఎంవీ రమణారెడ్డి, కళాకారులు పాల్గొన్నారు.

# అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- అధికారులకు జడ్సీ ఉపేందర్‌రెడ్డి ఆదేశం

మియాపూర్, జూలై 25 : వర్షాకాలం నేపథ్యంలో ముంపు ఏర్పడకుండా, పరిసరాల పరిశుభ్రత విషయంలో క్షేత్రస్థాయిలో సిబ్బంది అప్రమత్తతతో పని చేయాలని శేరిలింగంపల్లి జడ్‌సీ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. ప్రధానంగా అంటువ్యాధులు ప్రబలకుండా పటిష్ట చర్యలు చేపట్టాలన్నారు. గురువారం జోన్ పరిధిలోని మల్కంచెరువు, శిల్పారామం రోడ్డు, రోడ్ నంబర్ 45, కొత్తగూడ కూడలి, గచ్చిబౌలి, బయోడైవర్సిటీ ప్రాంతాల్లో జడ్సీ వివిధ విభాగాల అధికారులతో కలిసి పర్యటించారు. వరద నీరు నిలిచే ప్రాంతాలను, సెంట్రల్ మీడియాలో పచ్చదనం, నూతన మ్యాన్‌హోల్స్, పారిశుద్ధ్య చర్యలను ఆయన పరిశీలించారు. అనంతరం జడ్సీ మాట్లాడుతూ వరద నీరు అధికంగా నిలిచే ప్రాంతాల్లో యుద్ధప్రాతిపదికన నివారణ చర్యలు చేపట్టాలన్నారు. రెండు ప్రాంతాల్లో అంతర్గత ట్యాంకుల నిర్మాణాలను చేపడుతున్నామన్నారు.మురుగు నీరు నిల్వకుండా చర్యలు చేపట్టాలని, రోజు వారీ పారిశుద్ధ్య పనులు పూర్తయిన వెంటనే వ్యర్థాలు, చెత్తను తరలించాలని సిబ్బందిని ఆదే శించారు. వర్షాకాలం ముగిసే వరకు ట్రాఫిక్, ప్రజారోగ్యానికి ఎటువంటి ఇబ్బందుల తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని సూ చించారు. సిబ్బంది పనితీరును అధికారులు ఎప్పటికపుడు పర్యవేక్షించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ శంకర్, విక్రం, ఈఈ శ్రీనివాస్, డీఈ శిరీష, వైద్యాధికారి డాక్టర్ నగేశ్, డీఈఈలు, ఏఈలు పాల్గొన్నారు.

మెటల్ చార్మినార్ సమీపంలో రోడ్డు పక్కన నాలాను పరిశీలిస్తున్న శేరిలింగంపల్లి జడ్సీ ఉపేందర్‌రెడ్డి

# ఆంధ్ర ప్రొఫెసర్లకు గ్రూప్స్ నిర్వహణ బాధ్యతలా..!

- జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ జేఏసీ చైర్మన్ బొట్ల భిక్షపతి

కేపీహెచ్‌బీ కాలనీ, జూలై 25 : తెలంగాణ ప్రభుత్వం గ్రూప్-1, 2 పరీక్షల నిర్వహణ బాధ్యతలను ఆంధ్ర ప్రొఫెసర్లకు అప్పగించడం బాధకరమని, ఇది స్థానిక ప్రొఫెసర్లను అవమానించి తెలంగాణకు ద్రోహం చేయడమేనని జేఎన్‌టీయూహెచ్ వర్సిటీ జేఏసీ చైర్మన్ బొట్ల భిక్షపతి పేర్కొన్నారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. రిటైర్డ్ అయిన ఆంధ్ర ప్రాంత ప్రొఫెసర్లను ఎమెరిటస్ ప్రొఫెసర్లుగా తీసుకోవాడమే కాకుండా తెలంగాణ ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న గ్రూప్స్ పరీక్షల బాధ్యతలు ఇవ్వడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. దీనిపై పునారాలోచన చేయాలని వర్సిటీ అధికారులను కోరారు. జేఎన్‌టీయూహెచ్ వర్సిటీలో గత రెండు, మూడేండ్లుగా తెలంగాణ ప్రొఫెసర్లును కాదని, ఆంధ్ర ప్రొఫెసర్లకు ప్రవేశ పరీక్షల కన్వీనర్లుగా, కోకన్వీనర్లుగా నియమించి, అకడమిక్ ప్రవేశ పరీక్షల నిర్వాహణ బాధ్యతలు అప్పగిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సీనియర్ ప్రొఫెసర్‌లు ఉన్నప్పటికీ.. ఇంకా ఆంధ్ర ప్రొఫెసర్లను కీలకమై పదవులు, బాధ్యతల్లో కొనసాగించడంపై తెలంగాణ అమరవీరుల ఆత్మ ఘోషిస్తుందన్నారు. రాష్ట్రంలో కీలకమైన పదవులు, బాధ్యతలను ఉద్యమకారులు, తెలంగాణవాదులకు అప్పగించేలా సీఎం రేవంత్‌రెడ్డి దృష్టిసారించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## వలసకూలీ హత్య కేసులో నిందితుడి అరెస్టు

శేరిలింగంపల్లి, జూలై 25 : వట్టినాగులపల్లిలో వలస కూలీని హత్యచేసిన నిందితుడిని అరెస్టు చేసినట్లు గచ్చిబౌలి ఇన్‌స్పెక్టర్ అంజనేయులు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి.. ఉత్తరప్రదేశ్‌కు చెందిన వలసకూలీ రాజ్ కుమార్(44) తలపై సుత్తితో మోదడంతో హత్యకు గురైన విషయం తెలిసిందే. కాగా రాజ్‌కుమార్‌తో తనతోపాటు వెంట తీసుకు వచ్చిన ఆరుగురు పెయింటింగ్ కూలీల్లో రాంసింగ్(54) ఈ హత్య చేసినట్లు పోలీసులు దర్యాప్తులో తేల్చారు. గుత్తేదారుగా వ్యవహరించే రాజ్‌కుమార్ రెండు నెలలుగా రాంసింగ్‌కు కూలీ డబ్బులు ఇవ్వడం లేదని మంగళవారం రాత్రి ఇద్దరు వట్టినాగులపల్లిలో ఘర్షణ పడ్డారు. మిగిలిన కూలీలు ఇద్దరికీ సర్దిచెప్పడంతో శాంతించారు. అనంతరం అందరూ నిద్రపోయారు. గది బయట కారిడార్‌లో పడుకున్న రాజ్‌కుమార్‌ను రాంసింగ్ అర్ధరాత్రి తలపై సుత్తితో మోది హత్య చేసినట్లు పోలీసులు ఆధారాలు సేకరించారు. నింది తుడిని గురువారం రిమాండ్‌కు తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## రోడ్లపై గుంతలను వెంటనే పూడ్చాలి

18వ డివిజన్‌లో రోడ్లపై గుంతలను పరిశీలిస్తున్న కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి, తదితరులు

దుండిగల్, జూలై 25 : వానలు అధికంగా కురుస్తున్నందున ప్రజలు, అధికారులు అప్రమత్తంగా ఉండాలని నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ 18వ డివిజన్ కార్పొరేటర్ కొలన్ వీరేందర్‌రెడ్డి అన్నారు. గత కొన్ని రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో డివిజన్‌లోని పలు అంతర్గత రోడ్లపై గుంతలు ఏర్పడినట్లు తెలుసుకున్న కార్పొరేటర్ వీరేందర్‌రెడ్డి గురువారం కాంగ్రెస్ పార్టీ నిజాంపేట్ కార్పొరేషన్ అధ్యక్షుడు కొలన్ రాజశేఖర్‌రెడ్డితో కలిసి పలు కాలనీల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాలనీల్లో రోడ్లపై ఏర్పడిన గుంతలను వెంటనే పూడ్చివేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు కొలన్ జీవన్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ ధీరజ్, కాలనీవాసులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని జడ్సీకి వినతి

మియాపూర్, జులై 25 : కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ చౌహాన్‌ను ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్ గౌడ్ గురువారం ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేశారు. అనంతరం డివిజన్‌లో నెలకొన్న సమస్యలను పరిష్కరించటంతో పాటు అభివృద్ధి పనులకు తగిన నిధులను కేటాయించాలని జడ్సీ చౌహాన్‌కు వినతిపత్రం సమర్పించారు. జడ్సీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్, విఠల్, భాస్కర్‌రెడ్డి, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

## దూలపల్లి రోడ్డు విస్తరణ పనులను త్వరగా పూర్తి చేయాలి

దూలపల్లి నాగార్జున డ్రీమ్‌ల్యాండ్ ఎదుట ప్రమాదకరంగా ఉన్న ఇనుప చువ్వలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు శివాజీరాజు, సతీశ్‌సాగర్

కుత్బుల్లాపూర్, జూలై 25 : కొంపల్లి చౌరస్తా-దూలపల్లి ప్రధాన రహదారి విస్తరణ పనులు మధ్యలో ఆగిపోయాయని, వెంటనే పూర్తి చేసి వాహనదారులు, ప్రయాణికుల ఇబ్బందులను తొలగించాలని బీజేపీ కుత్బుల్లాపూర్ అసెంబ్లీ కోకన్వీనర్ శివాజీ రాజు, ఓబీసీ మోర్చా మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ. సతీశ్‌సాగర్ ప్రభుత్వాన్ని కోరారు. గురువారం అసంపూర్తిగా నిలిచిపోయిన పనులను వారు పరిశీలించి మాట్లాడారు. రోడ్డు మధ్యలో డివైడర్ కోసం ఏర్పాటు చేసిన ఇనుప చువ్వలను రెండు నెలలుగా వదిలేయడంతో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. రోడ్డును పనులను సకాలంలో పూర్తి చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులు తగిని చర్యలు తీసుకోవాలని కోరారు.

## పీఆర్‌టీయూఎస్ సభ్యత్వ నమోదు



శేరిలింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొన్న పీఆర్‌టీయూఎస్ నాయకులు

శేరిలింగంపల్లి, జూలై 25 : ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో పీఆర్‌టీయూఎస్ ముందుంటుందని ఆ సంఘం రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి సామల మహేందర్‌రెడ్డి అన్నారు. గురువారం శేరిలింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. త్వరలో ఏకీకృత సర్వీసులు సాధిస్తామని, ఉపాధ్యాయులకు ఎంఈఓలు, జేఎల్, డైట్ లెక్చరర్‌గా పదోన్నతులు కల్పించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూఎస్ మండలశాఖ అధ్యక్షుడు హనుమంతు, శివరాజ్, నరహరి, చంద్రశేఖర్, రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### వివిధ కోర్సుల పరీక్షా ఫీజు స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 25: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని వివిధ కోర్సుల పరీక్షా ఫీజును స్వీకరించనున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. పీజీ డిప్లొమా ఇన్ కలినరీ ఆర్ట్స్ రెండో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మొదటి సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 2లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలని చెప్పారు. రెండేళ్ల ఎంసీఏ (సీబీసీఎస్) రెండు, నాలుగో సెమిస్టర్ మెయిన్, బ్యాక్‌లాగ్, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫీజును వచ్చే నెల 6 లోగా సంబంధిత కళాశాలల్లో చెల్లించాలన్నారు. ఈ పరీక్షలను వచ్చే నెలలోనే నిర్వహించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు www. osmania.ac.in వెబ్‌సైట్‌లో చూసుకోవచ్చని సూచించారు.

**దూరవిద్య పీజీ కోర్సుల పరీక్షా తేదీల మార్పు**

ఉస్మానియా యూనివర్సిటీ దూర విద్యా కేంద్రమైన ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే వివిధ పీజీ కోర్సుల పరీక్షా తేదీలను మార్చినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఏ, ఎంకామ్, ఎమ్మెస్సీ మొదటి, రెండో సంవత్సరం పరీక్షలను వచ్చే నెల 13 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించారు.

**రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులు**

ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ జి. రాంరెడ్డి సెంటర్ ఫర్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్ ద్వారా అందించే ఎంసీఏ పరీక్షా ఫలితాల రీవాల్యూయేషన్‌కు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ రాములు ఒక ప్రకటనలో తెలిపారు. ఎంసీఏ నాలుగో సెమిస్టర్ మెయిన్, మొదటి, రెండు, మూడో సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షా ఫలితాలను ఇప్పటికే విడుదల చేసినట్లు పేర్కొన్నారు. విద్యార్థులు తమ మార్కు మెమోలను మూడు వారాల తరువాత తీసుకోవాలని సూచించారు. ఈ ఫలితాలపై రీవాల్యూయేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలనుకుంటే ఒక్కో పేపర్‌కు రూ. 800 చెల్లించి, ఈనెల 26గా టీఎస్ ఆన్‌లైన్ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. రూ.200 అపరాధ రుసుముతో వచ్చే నెల 5 వరకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. జవాబు పత్రాల నకలు పొందగోరువారు ఒక్కో పేపర్‌కు రూ.1000 చెల్లించి వచ్చే నెల 2 లోగా తమ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

# విద్యార్థుల్లో ప్రతిభను ప్రోత్సహించేందుకు 'అంకురం'

టీ హబ్‌లో నిర్వహించిన అంకురం కార్యక్రమంలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

కొండాపూర్, జులై 25 : విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెతికితీయడంతో పాటు సరికొత్త ఆవిష్కరణల సుసాధ్యానికి సమగ్ర శిక్షా తెలంగాణ, ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్, ఇంక్వి-ల్యాబ్ ఫౌండేషన్, వై-హబ్, ఓక్‌నార్త్ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం నాలెడ్జిసిటీలోని టీ-హబ్‌లో అంకురం, షోకేస్-24ను ప్రారంభించింది. 2024-25 విద్యా సంవత్సరం గ్రేడ్-11 విద్యార్థుల కోసం అంకురం బిజినెస్ ఇన్నోవేటర్స్ ప్రోగ్రామ్, గ్రేడ్-9 విద్యార్థుల కోసం అంకురం ఎంట్రప్రెన్యూరియల్ మైండ్‌సెట్ ప్రోగ్రామ్‌లను నిర్వహిస్తున్నట్లు ఉద్యమ్ లెర్నింగ్ ఫౌండేషన్ సీఈఓ, వ్యవస్థాపకులు మేకిన్ మహేశ్వరి తెలిపారు. గతేడాది నిర్వహించిన కార్యక్రమంలో 35 పాఠశాలల నుంచి 2,800 మంది విద్యార్థులు పాల్గొన్నారని, గ్రేడ్ 11కు చెందిన విద్యార్థుల టాప్-20 వ్యాపార ఆలోచనలు ప్రదర్శింపబడినట్లు తెలిపారు.

తెలంగాణలోని 35 ప్రభుత్వ పాఠశాలల్లో పైలట్ ప్రాజెక్ట్‌గా ప్రారంభించబడిన ఈ కార్యక్రమం ప్రస్తుతం 33 జిల్లాల్లోని 409 పాఠశాలల్లో 9, 11వ తరగతులకు చెందిన 50వేల మంది విద్యార్థులు ప్రోగ్రామ్‌లో భాగస్వాములైనట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇంక్వి-ల్యాబ్ కో-ఫౌండర్, వివేక్ పిద్దెంపల్లి, ఓక్‌నార్త్ సీఎస్ఆర్ హెడ్ తారా చంద్ తదితరులు పాల్గొన్నారు.

# నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తి అభివృద్ధే లక్ష్యం..

- మహీంద్రా యూనివర్శిటీ వీసీ డాక్టర్ యాజులు మేదురి

ఎంఓయూ పత్రాలు చూపుతున్న మహీంద్రాయూనివర్శిటీ ప్రతినిధులు

దుండిగల్,జూలై 25 : నైపుణ్యం కలిగిన శ్రామిక శక్తిని అభివృద్ధి చేయడమే లక్ష్యమని మహీంద్రా యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ యాజులు మేదురి అన్నారు. సుస్థిర భవిష్యత్తును నిర్మించాలన్న ఉద్దేశంతో హైదరాబాద్ మహీంద్రా యూనివర్శిటీ ప్రాంగణంలో యూనివర్శిటీ నేషనల్ అకాడమీ ఆఫ్ కన్‌స్ట్రక్షన్(ఎన్ఏసీ), ప్రీ ఇంజినీర్డ్ స్ట్రక్చర్స్ సొసైటీ ఆఫ్ ఇండియా(పీఏఎస్ఐ) గురువారం పరస్పర అవగాహన ఒప్పందం(ఎంవోయూ) కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా వీసీ డాక్టర్ యాజులు మేదురి మాట్లాడుతూ దేశంలో నిర్మాణ, ఇంజినీరింగ్ విద్యలో అత్యుత్తమ స్థాయిని సాధించడానికి ఈ ఒప్పందం కీలకమైనదని అన్నారు. మౌలిక సదుపాయాల అభివృద్ధికి ఇది దోహదపడుతున్నదన్నారు. పరిశ్రమ అవసరాలను విశ్లేషించడం,సర్టిఫికెట్ కోర్సులు,పోస్ట్ గ్రాడ్యుయేటర్ డిప్లొమా ప్రోగ్రామ్‌లను అందించడం సాధ్యమవుతుందని తెలిపారు. తద్వారా నైపుణ్యం కలిగిన వర్క్‌ఫోర్స్‌ను అభివృద్ధి చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎన్ఏసీ డైరెక్టర్ జనరల్ పీ.మధుసూదన్, పీఏఎస్ఐ అధ్యక్షుడు ప్రసాద్, సీఐఐ తెలంగాణ విభాగం చైర్మన్ శేఖర్‌రెడ్డి, ఎన్ఏసీ డైరెక్టర్ ఎం. రాజిరెడ్డి, మహీంద్రా యూనివర్సిటీ అసిస్టెంట్ డీన్ విశాలాక్షి, సివిల్ ఇంజినీరింగ్ విభాగం అధిపతి డాక్టర్ హరిప్రసాద్, విశ్వవిద్యాలయ స్కూల్ ఇన్నోవేషన్ డీన్ ప్రొఫెసర్ బీకే చక్రవర్తి, ఎన్ఏసీ సీనియర్ ఫ్యాకల్టీ మురళీధర్, ఇన్వెంటా ఎండీ సత్యనారాయణ, జేఎన్‌టీయూ ఎమెరిటస్ ప్రొఫెసర్ కామేశ్వర్‌రావు, పద్మజ గోకరాజు, ధ్రుమతరు ఎండీ రాజ్‌కుమార్, ఎడ్యుటెక్ ఎండీ సురేశ్, పీఏఎస్ఐ సెక్రటరీ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## పగలు రెక్కీ.. రాత్రి చోరీ

- నిందితుడు అరెస్టు, రూ 4.80లక్షల సొత్తు స్వాధీనం

నిందితుడు కొలిపాకల మణికంఠ, పోలీసులు స్వాధీనం చేసుకున్న బంగారు ఆభరణాలు

అల్లాపూర్, జూలై 25: పగలు రెక్కీ నిర్వహించి రాత్రిళ్లు చోరీలకు పాల్పడుతున్న ఓ వ్యక్తిని అల్లాపూర్ పోలీసులు గురువారం రిమాండ్‌కు తరలించారు. అతడి వద్ద రూ. 4.80లక్షల విలువైన బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకున్నారు. అల్లాపూర్ సీఐ వెంకట్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కొలిపాకల మణికంఠ(21) జగద్గిరిగుట్టలో క్యాటరింగ్ పని చేస్తుంటాడు. ఆన్‌లైన్ బెట్టింగ్, జల్సాలకు అలవాటు పడి అవసరాలు తీర్చుకునేందుకు సులభంగా డబ్బు సంపాదించాలనే ఆలోచనలతో పగలు రెక్కి నిర్వహించి తాళం వేసి ఉన్న ఇండ్లల్లో రాత్రిళ్లు దొంగతనాలు చేయడం మొదలుపెట్టాడు. రోజు వారి తనీఖీల్లో భాగంగా అల్లాపూర్ పోలీసులు గాయత్రినగర్‌లో తనీఖీలు నిర్వహిస్తుండగా అనుమానస్పందగా తచ్చాడుతున్న మణికంఠను విచారించారు. పొంతనలేని సమాధానం చెప్పడంతో అదుపులోకి తీసుకుని ప్రశ్నించగా కూకట్‌పల్లి, అల్లాపూర్ ఏరియాల్లో చోరీలు చేసినట్లు ఒప్పుకున్నాడు. అనంతరం నిందితుడి వద్ద నుంచి రూ. 4.80 లక్షల విలువైన సుమారు 7 తులాల బంగారు ఆభరణాలు, ఒక సెల్‌ఫోన్ స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

### చందానగర్ మలబార్ గోల్డ్ షోరూమ్‌లో 'ఆర్టిస్ట్రీ' బ్రాండెడ్ జ్యువెలరీ షో

కొండాపూర్, జూలై 25 : చందానగర్‌లోని మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ షోరూమ్‌లో సరికొత్తగా ప్రవేశపెట్టిన 'ఆర్టిస్ట్రీ' బ్రాండెడ్ జ్యువెలరీ షోను గురువారం సినీ నటి, 'ఫిదా' మూవీ ఫేమ్ శరణ్య ప్రారంభించింది. ఆర్టిస్ట్రీ జ్యువెలరీ షోలోని ఆభరణాలు ప్రత్యేకంగా ఆకట్టుకుంటున్నాయని ఆమె పేర్కొన్నారు. సరికొత్త డిజైన్లతో నగలు అద్భుతంగా ఉన్నాయన్నారు. కస్టమర్లు మెచ్చేలా నగలు అందుబాటు ధరలోనే మలబార్ గోల్డ్ యాజమాన్యం అందజేస్తున్నట్లు తెలిపారు.

## పట్టువస్త్రాల సమర్పణ

కూకట్‌పల్లిలోని పోచమ్మ ఆలయంలో గురువారం వివేకానందనగర్ డివిజన్ కార్పొరేటర్ మాధవరం రోజాదేవి అమ్మవారికి పట్టు వస్త్రాలు, వడి బియ్యం సమర్పించారు. అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు కార్పొరేటర్‌కు ఆశీర్వచనం అందించారు. - మియాపూర్ , జూలై 25

### నేడు గంగమ్మ కల్యాణం

రామంతాపూర్, జూలై 25: రామంతాపూర్ చిన్న చెరువులో వెలసిన గంగాభవానీ ఆలయంలో శుక్రవారం అమ్మవారి కల్యాణం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు సత్తయ్య, గంగపుత్ర సంఘం అధ్యక్షుడు మల్లయ్య తెలిపారు.

**DOCUMENT LOST**

I, RAMAKRISHNA KONCHADA, S/o. Bhaskara Rao Konchada, R/o. Serilingampally, Hyd., TG, have Lost Original Registered Sale Deed vide Doc.No. 3924/1989 (Link Document), Registered at Joint Sub-Registrar, R.O. Ranga Reddy, while shifting house. Anybody found, Contact: Ramakrishna. 9849944627

**SUMMONS/NOTICE**

NOTICE TO JUDGEMENT DEBTOR/ DEFENDANT IN THE COURT OF THE HON'BLE II ND ADDITIONAL DISTRICT & SESSIONS JUDGE CUM II ND ADDITIONAL METROPOLITAN SESSIONS JUDGE COURT - CUM - II ND ADDITIONAL FAMILY COURT : MEDCHAL - MALKAJGIRI DISTRICT AT : MEDCHAL

E.P.No. 224 of 2023 in O.S.No. 837 of 2014

BETWEEN:

Sri M. Ravinder ...Decree Holder/Plaintiff

And

Sri M. Srinivas ...Judgment Debtor/Defendant

To

Sri M.Srinivas, S/o. M.Mallaiah, Age: 48 years, Occ: Business, R/o. Flat No. 507, "B" Block, Silver Spring Apartments, C/o. Modi Buildings, Suchitra Road, Venkateswara Nagar, Quthubullapur, Hyderabad-54, A.P. (Judgment Debtor/Defendant)

SUMMONS

Please take notice that the Decree Holder/Plaintiff had filed the above E.P. praying this Hon'ble Court may be pleased to issue warrant for attachment of the E.P. Schedule A & B immovable properties of Judgment Debtor Under Order 21 Rule 54 of CPC and to proclaim and sell the same Under Order 21 Rule 64 & 66 of CPC for realizing decreetal amount of Rs.37,91,078/- and the same is posted for your notice and the above matter is posted to 06-09-2024.

You are hereby advised to appear before the above designated Court at 10.30 a.m. on 06-09-2024 in person or by an advocate duly instructed. Therefore make it convenient to attend the Court on the said date and time before the Hon'ble Court. In the event of your failing to appear before the designated Court, matter will be heard and appropriate orders will be passed by the Hon'ble Court in accordance with law.

(BY ORDER OF THE COURT)
M/s. V.RAMCHANDER GOUD, S.THIRUNATHAN,
Advocate, H.No. 1-11-59/B, New Bowenpally, Secunderabad-11, Cell No. 9885177045.
Email: thirunathan.s@gmail.com